

# వినమ్ర కృతజ్ఞతాంజలి.

సమాజ వ్యవస్థలన్నింటిలో ఉత్కృష్ట వ్యవస్థ విద్యావ్యవస్థ.

మెదడు ఉన్నతంగా ఆలోచిస్తే మిగిలిన శరీర వ్యవస్థలు సక్రమంగా నడుచుకునే రీతిలో, విద్యావ్యవస్థ సానుకూల దృక్పథంతో రూపొందగలిగినప్పుడు, తోటి వ్యవస్థలతో కూడి సమాజం విలువల సంగమమౌతుంది. ఈప్రక్రియలో మనసున్నమనుషులంతా ఆర్తిగా ముందుకు కదిలినప్పుడు ధరిత్రిపై విజ్ఞాన ధవల కాంతులు వెల్లి విరుస్తాయి.

నమ్రత, నాణ్యత, నమ్మకం, నిగ్రహం, నిలకడ మొదలగు భారతీయ విశ్వాసాలు విశ్వానికి శాశ్వత ఆదర్శ ఆచరణీయాలు. వీటిని సుగమంగా ప్రయానింపజేసే పల్లకీ విద్యలవ్యవస్థ మరియు బోయీలు ఉపాధ్యాయులు మాత్రమే.

ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ ఒక సానుకూల దృక్పథంతో, పారదర్శకంగా, పది కాలాలపాటు మదిలో మనగలిగే రీతిలో పరివర్తన చెందుతోంది. ప్రతి విద్యార్థి కేంద్రంగా అభ్యసన ఫలితాలపై గురి పెడుతూ, వాటి చుట్టూ అల్లుకున్న పరిసరాలను ఒక్కొక్కటిగా మారుస్తూ, పేరుస్తూ నాణ్యతను సాధించే ప్రయత్నం చేస్తోంది. దాదాపు ముప్పై మూడు లక్షల నలభై ఒక్క వేల, నాలుగువందల పద్దెనిమిది సమగ్ర ప్రగతి పత్రాలపై ఫోటోలను నిరాకరిస్తూ మరియు 45,111 పాఠశాలల్లో వ్యక్తిగత స్వాగత బ్యానర్లను, ఉన్న ఒకే బ్యాక్ గ్రౌండ్ బ్యానర్ పై తమ ఫోటోలను వద్దనుకున్న నిరాడంబర, విద్యపై అనురక్తి కలిగిన యువ మంత్రివర్యుల నాయకత్వంలో, అత్యంత అనుభవశీలురే కాక సమాజం యెడల ఒక నిబద్ధతగల ఉన్నతాధికారుల నిరంతర అనుసృజన ఇప్పటికే విద్యలవ్యవస్థలో ఒక కదలికను ప్రస్ఫుటిస్తోంది.



ఒక వ్యవస్థ గెలుపుకైనా, ఓటమికైనా ప్రధాన కారణం 'నాయకత్వ లోపంగా' విజ్ఞులు చెబుతూ ఉంటారు. ఇదే నాయకత్వ స్ఫూర్తి కొనసాగితే 'పురోగామిత మార్పు' తధ్యమని విశ్వసించాల్సిందే.. మొన్నటి పారదర్శక ఆన్లైన్ పనిసర్దుబాటు సబ్జెక్టు ఉపాధ్యాయులను కొరతను తీరిస్తే, నిన్నటి ఆత్మీయ సమావేశాలు పాఠశాలలు త్వరలోనే 'సరస్వతి నడయాడే దేవాలయాలుగా' రూపొందుతాయనే నమ్మకాన్ని తల్లిదండ్రులు, సమాజ సభ్యులలో ప్రోదిచేశాయి

ప్రతి 'అభ్యసన కేంద్రంలో' పోటెత్తిన జనసంద్రం మాకు 'మీపై ప్రేమ ఉంది. మా పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతారనే నమ్మకం ఉంది.. విజయోస్తు గురువర్యులారా..' అంటూ మమ్మల్ని ఆశీర్వదించటం మా జీవితంలో మరువలేని సుదినం.




ఈ విజయానికి 'సృజన సిక్కోలు' అధికార యంత్రాంగమంతా కదలి, కలిసి రావటం శ్రీముఖలింగం పాఠశాలలో కళ్ళారా చూసి మనసు ఉప్పొంగిపోయింది. ఇదే కదా వ్యవస్థల మధ్య సమన్వయం, సహకారం.

ఈ దిగ్విజయ విద్యాఉత్సవంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి పేరుపేరునా వినమ్ర కృతజ్ఞతాంజలి.🦚🤝🙏🏻



ఎప్పటికీ
మీ
డా.తిరుమల చైతన్య.
జిల్లా విద్యాశాఖాధికారి శ్రీకాకుళం


